


జర్మనీ సర్వనాశనం అయ్యేంత వరకు హిట్లర్ చేసే ప్రతిపనిలో ప్రజలకు కేవలం దేశభక్తి మాత్రమే కనిపించేది. ఈ రోజు మన భారతదేశం పరిస్థితి సరిగ్గా అదే ఉంది. దేశం వినాశనం అంచున నిలబడి ఉన్నా..ఇంకా మోడీ మోడీ అంటున్నారు..

– కమల్ హాసన్


telangana chowrastha.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:301

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | CHOWRASTHA DIGITALS | 24.05.2026 ఆదివారం, హైదరాబాద్


# ప్రభుత్వ ఇంటర్ కాలేజీలలో మధ్యాహ్న భోజనం పథకం

ఉదయం అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం

గోదావరి పుష్కరాల పనులకు రూ.వెయ్యి కోట్లు

నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యం

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలపై విస్తృతంగా చర్చలు

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత జూన్ 1న ప్రారంభం కానుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి 1,500 మంది స్థలాలు ఉన్నవారికి రూ.5 లక్షలు కేటాయిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 14,800 పూరి గుడిసెలు ఉన్నట్టు గుర్తించామన్నారు. రెండో విడతలో వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 7 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్థలాలు ఉన్న 18,500 మందికి ఈ నెలాఖరు వరకు ప్రొసీడింగ్స్ ఇస్తామని చెప్పారు. అర్హులకు నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాల్లో లక్ష ఇళ్లు కట్టి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో మధ్యతరగతి ప్రజలకు 30శాతం ఇళ్లు కట్టి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. పాఠశాలలు,

..మిగతా 2 లో



సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రెండు గంటలుగా మంత్రివర్గ సమావేశం కొనసాగుతుంది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న పలు అంశాలపై కేబినెట్ చర్చిస్తోంది. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఈ స్కీమ్ అమల్లో ఉంది. ఇప్పుడు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. దీనికి సంబంధించిన పలు అంశాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



## భూమి కోసం దారుణం

- అక్కను హత్య చేసిన తమ్ముడు
- 17 గుంటల భూమి కోసం అక్కను చంపిన తమ్ముడు
- సైదులుకు, అతని చెల్లెలు ఉమకు మధ్య కొంతకాలంగా భూవివాదం
- భూమి కోసం చెల్లెలు ఉమకు మద్దతుగా నిలిచిన అంజమ్మ

2

## యాదగిరిగుట్టకు రూ.99.55 కోట్లతో అభివృద్ధి

- యాదగిరిగుట్ట క్షేత్రాన్ని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి
- 15 ఎకరాల్లో వేదపాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన
- రెండేళ్లలో తరగతులు ప్రారంభం కావాలి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, శంకుస్థాపన
- సీఎం రేవంత్ రెడ్డి

2





2

## వడదెబ్బకు 16 మంది మృతి

- మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం
- విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు మృతి
- నీటి తొట్టెలు,మట్టి కుండలతో పక్షులు,జంతువులకు తాగునీరు అందించండి
- ప్రజలతో పాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతే

## సవాళ్లు అధిగమిస్తేనే భవిష్యత్

- సీఎంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సత్కారం
- సలహాదారులుగా ఎదగాలని సూచన
- దేశ ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర
- సమాజంలో పారదర్శకతను పెంచే బాధ్యత మీపైనే
- ఐసీఏఐ స్నాతకోత్సవంలో కేటీఆర్

2



## పాలిసెట్ లో 82.94 శాతం ఉత్తీర్ణత

- పాలిసెట్ ఫలితాలను విడుదల చేసిన శ్రీదేవసేన
- బాలికలదే పై చేయి...
- 38 శాతం పాస్
- 79.92 శాతం అర్హత సాధించిన బాలురు

2



## న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ దారుణ హత్య

- కారుతో ఢీకొట్టి పరారైన దుండగులు
- కార్ ఎక్కుబోతుండగా ప్రత్యర్థులు పక్కా ప్రణాళికతో దాడి
- పరిస్థితి విషమించి ఆ పై మృతి




2

## మళ్లీ పెట్రో బాదుడు

- 8 రోజుల్లో మూడోసారి పెంపు
- తాజాగా 90పైసలు పెంపు
- సీఎన్‌జీ మూడోసారి కిలోకు రూపాయి
- యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకం

2



## మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరు

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మోదీ ఓ చాన్స్
- భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చు
- ప్రధాని ప్రపోజల్‌పై ఎంపీ ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు
- పోక్సో కేసు తర్వాత బండితో మాట్లాడలేదని వెల్లడి

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:
ప్రధాని మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మోదీ ఓ చాన్స్ ఇచ్చారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. శనివారం ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రతిపాదన విషయంలో.. భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చని పేర్కొన్నారు. సువేందు అధికారి, ఏక్‌నాథ్ షిండేలాగే రేవంత్‌రెడ్డికి ఆఫర్ ఇచ్చారేమో! అని వెల్లడించారు. రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడం తమ పార్టీ

..మిగతా 2 లో








# ప్రభుత్వ ఇంటర్ కాలేజీలలో మధ్యాహ్న భోజనం పథకం

▶▶ మొదటిపేజీ తరువాయి

జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని కేబినెట్ నిర్ణయాని కొచ్చిందని వెల్లడించారు. గోదావరి పుష్కరాలకు తొలివిడతగా రూ.300 కోట్ల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఆర్‌టీఎస్ఎస్‌లో చేరేందుకు డిస్కంల ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో విలీనం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను హాకాలో విలినం చేయాలని నిర్ణయించామన్నారు.2026-2030 లైఫ్ సైన్సెస్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్‌పై ఎక్కువ దృష్టి పెడతామని స్పష్టం చేశారు. ఆర్అండ్‌డీ యూనిట్లను పరిశ్రమలుగా గుర్తించే విధంగా పాలసీలో మార్పులు తీసుకొస్తామన్నారు. జీసీసీ, జీఐసీలు రావడానికి పాలసీ ఉపయోగపడుతుందన్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.587 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. భూసేకరణ, పునరావాసం, మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించామన్నారు. గంగాధరలో నూతన డిగ్రీ కళాశాలలో పలు పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. 20 రెగ్యులర్ టీచింగ్, 6 నాన్‌టీచింగ్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన 3 పోస్టుల మంజూరుకు ఆమోదించింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు భూకేటాయింపునకు ఆమోదముద్ర వేసింది. కరీంనగర్ జిల్లాలో 14 ఎకరాల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వెలిదిలో 4, రుక్మాపూర్‌లో 5 ఎకరాలు, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపునకు ఆమోదముద్రవేసింది. ఇంకా ఈ సమావేశంలో ఇందిరమ్మ కుటుంబ బీమాతో పాటు కొత్త పింఛన్ల పంపిణీపైనా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.



# యాదగిరిగుట్టకు రూ.99.55 కోట్లతో అభివృద్ధి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో సంప్రదాయ వేద విద్యను బోధించే గురుకులం ఏర్పాటవ్వనుంది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయనగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నటువంటి వేద పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. మొత్తంగా రూ.100 కోట్లతో చేపట్టే పనులకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.వచ్చే రెండేళ్లలో వేదపాఠశాల నిర్మాణం పూర్తిచేసి తరగతులు ప్రారంభించనున్నారు. దీంతో పాటు మెట్లమార్గానికి పైకప్పు, మాడ వీధులకు మెట్లు, దీక్షాపరుల మండలం పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు పకడ్బందీ ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్ట వెళ్లిన ముఖ్యమంత్రి రేంత్ రెడ్డి 100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో యాదగిరి గుట్టకు వెళ్లిన సీఎం ముందుగా కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జగద్గురు పర్యవేక్షణలో వేదమంత్రోచ్చరణల నడుమ వేద పాఠశాలకు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. వేదపాఠశాలను రూ.43 కోట్ల వ్యయంతో 15 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఇందులో 300 మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసించే విధంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. వేద పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బోధనతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు. అత్యాధునికి గోశాలతో పాటు యజ్ఞశాల, యాగశాలలు సైతం నిర్మించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వేదపాఠశాలలో కంచి కామకోటి పీఠం పర్యవేక్షణలో బోధన చేపట్టనున్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం తోపాటు ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసేందుకు వీలు కల్పించి విద్యార్థులకు పట్టాలు అందించనున్నారు.యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించిన అనుబంధ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. 9 కోట్ల 86 లక్షలతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం, కోటి 41 లక్షలతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం, కోటి 34 లక్షలతోతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణంతోపాటు డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణాలకు రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అనంతరం టెంపుల్ సిటీ నుంచి ఆలయ కొండపైకి వెళ్లి లక్ష్మీనరసింహ స్వామి వారిని సీఎం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు. దర్శనం తర్వాత సీఎం హైదరాబాద్‌కు వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సవాళ్లు అధిగమిస్తేనే భవిష్యత్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మారుతున్న కాలంలో సంక్లిష్టమైన పన్ను నిబంధనలు, జీఎస్టీ వ్యవస్థ, వ్యాపారాల విస్తృతి నేపథ్యంలో దేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేయడంలో సీఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజంలో పారదర్శకతను పెంచే బాధ్యత వీరిపైనే ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. సీఏ కోర్సులోని కఠినత్వాన్ని, ఆ ఒత్తిడిని అధిగమించి విజయం సాధించిన ప్రతి విద్యార్థి, భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాలునైనా ధైర్యంగా ఎదుర్కోగల శక్తిమంతులని అభినందించారు. సీఏలు కేవలం అకౌంటింగ్ లేదా పన్నులకే పరిమితం కాకుండా, వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాపార సంస్థలు బలోపేతం అయినప్పుడే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, తద్వారా సామాన్య ప్రజల సంక్షేమానికి మార్గం సుగమం అవుతుందని ఆయన వివరించారు. మారుతున్న ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను వృత్తిలో భాగంగా చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా పని సామర్థ్యాన్ని



గణనీయంగా పెంచుకోవచ్చని ఉద్ఘాటించారు. ఈ స్థాయికి చేరుకోవడంలో విద్యార్థుల వెనుక ఉన్న తల్లిదండ్రుల అపారమైన త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని, వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లు సీఏ శ్రీధర్ ముప్పాళ్ల సీఏ దాయనివాస్ శర్మ ఐసీఏఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పెట్రో బాదుడు

**న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:**

పెట్రోల్, డీజిల్ ధరలు శనివారం మరోసారి పెరిగాయి. ఎనిమిది రోజుల వ్యవధిలోనే ఇది మూడోసారి పెరగడం. దేశవ్యాప్తంగా, అన్ని వేరియంట్లలోనూ తాజాగా లీటరుకు సగటున 90పైసలు పెరిగింది. అంతేగాకుండా, ఉత్తర భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచరల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర ఇదే కాల వ్యవధిలో మూడోసారి కిలోకు రూపాయి చొప్పున పెరిగింది. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర 87 పైసలు పెరిగి లీటరు ధర రూ.99.51కి చేరుకోగా, డీజిల్ ధర 91పైసలు పెరిగి, లీటరుకు రూ.92.49కి చేరుకుంది. ప్రీమియం వేరియంట్ డీజిల్ ధర లీటరుకు రూ.97.81కి చేరింది. ఇక హై ఆక్టేన్ వేరియంట్‌కి చెందిన పెట్రోల్ ఎక్స్‌పి 95 ధర 87పైసలు పెరిగి లీటరు ధర రూ.106.63కి చేరుకుంది. ఇతర మెట్రోలు ముంబయి, ఢిల్లీ, చెన్నైలతో పోల్చుకుంటే కోల్‌కతాలో ఎక్కువగా ఈ పెంపు కనిపిస్తుంది.అలాగే ఇతర మెట్రోలతో పోలిస్తే చైన్నైలో పెంపు ఒక మోస్తరుగానే వుంటుంది. చెన్నైలో 82పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.105.31కి పెరగగా, డీజిల్ ధర 87పైసలు పెరిగి లీముంబయిలో 90పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.108,49కి చేరుకోగాటరు రూ.96.98కి చేరింది. తాజాగా కోల్‌కతాలో లీటరు పెట్రోల్‌కు 94పైసలు పెరిగి లీటరు రూ.110.64కి చేరుకుంది. డీజిల్ కూడా 95పైసలు పెరిగింది. లీటరు ధర రూ.97.02కి చేరుకుంది. , డీజిల్ ధర 94పైసలు పెరిగి, లీటరు ధర రూ.95.02కి చేరుకుంది. ఢిల్లీలో



దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి)లో సిఎన్‌జి ధర కిలోకు రూ.81.09కి చేరుకుంది. మే 15/నుండి వరుసగా పెరుగుతున్న ధరల పెంపుతో ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు మొత్తంగా లీటరుకు రూ.4.8 చొప్పున పెరిగాయి. మొట్టమొదటసారిగా లీటరుకు మూడు రూపాయిలు చొప్పున పెరగగా, ఆ తర్వాత సగటున లీటరుకు 90పైసలు చొప్పున రెండుసార్లు మే 19, 23 తేదీల్లో పెరిగాయి. పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకం కలిగింది. దాంతో ముడి చమురు ధరలు బాగా పెచ్చరిల్లాయి. ఈ నేపథ్యంలో చమురు మార్కెటింగ్ కంపెనీలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది

# పాలిసెట్ లో 82.94 శాతం ఉత్తీర్ణత

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ పాలిసెట్ 2026 లో 82.94 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. శనివారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ లోని సాంకేతిక విద్యా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ కన్వీనర్ శ్రీదేవసేన ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎంపీసీ విభాగంలో మొత్తం 98,029 మంది పరీక్ష రాయగా 81,307 మంది, ఎంబైపీసీ విభాగంలో 79,652 మంది రాయగా 81.25 శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 52,201 మందికి గానూ 41,719 (79.92 శాతం), బాలికల్లో 45,828 మందికి గాను 39,588 (86.38 శాతం), ఎంబైపీసీ విభాగంలో బాలురు 40,554 మంది రాయగా 77.69 శాతం, బాలికల్లో 39,098 రాయగా 85.31 శాతం పాలిసెట్ లో అర్హత సాధించారు. ఎస్సీలు 18,481 మంది, ఎస్టీలు 8,817 మంది పరీక్ష రాశారు. రెండు విభాగాల్లో వంద శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 15 మంది టాప్ ర్యాంకులు సాధించారు. వారిలో ఎనిమిది బాలురు ఉండగా, ఏడుగురు బాలికలున్నారు. ఎంబైపీసీ విభాగంలో టాప్ ర్యాంకులు సాధించిన 15 మందిలో నలుగురు బాలికలుండగా, 11 మంది బాలురున్నారు. ఎంపీసీ విభాగంలో ఓసీలు 9,771 మంది పరీక్ష రాయగా 8,185 మంది (83.77 శాతం), బీసీఏలో 9,565కి గానూ 6,844మంది 71.56 శాతం, బీసీ బీలో22,401కి గానూ 17,588 మంది 78.51 శాతం, బీసీ సీలో 230కి గానూ 180 మంది 78.26 శాతం, బీసీడీలో 24,244కి గానూ 17,824 మంది 73.52 శాతం, బీసీఈలో 4,520కి గానూ 3,378 మంది 74.73 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఎంబైసీలోనూ సామాజిక వర్గాల వారీగా ఓసీ, బీసీఎ, బీసీబీ, బీసీసీ, బీసీడీ, బీసీఈ వరస క్రమంలో నిలిచారు.

**టాప్ ర్యాంకర్లు వీరే**

నామల లోకేశ్ (వరంగల్)
బానోత్ హేమంత్ (సూర్యాపేట)
అల్వియా షిఫాలీ (మంచిర్యాల)
మహమ్మద్ మహబూబ్ అర్బాజ్ అలీ (ఖమ్మం)
కోట్ల అపూర్వ (మహబూబ్ నగర్)
అన్నం హరి కృష్ణ (సంగారెడ్డి)
జంగల అన్వేష్ అంగాడ్ (నల్లగొండ)
చిలకనంద వర్ధన్ రెడ్డి (సూర్యాపేట)
కందూరి ఆదిత్య శౌరి (ఖమ్మం)
రుద్రోజ్ సజన్ (సిద్ధిపేట్)
దూరెడ్డి వన్మయ్ రెడ్డి (నాగర్ కర్నూల్)
షేక్ ఫర్మాన్ షా (మహబూబాబాద్)
కటకం ప్రణవి (జగిత్యాల)
కీలపర్తి దేవిప్రియ (మేడ్చల్ - మల్కాజిగిరి)
ఉలువాల వైష్ణవి (సూర్యాపేట)
జక్కు తుషారా (హైదరాబాద్).

**ఎంబైపీసీ విభాగంలో**

కోట్ల అపూర్వ (మహబూబ్ నగర్)
రుద్రోజు సజన్ (సిద్ధిపేట్)
ఖానల హేమంత్ రెడ్డి (సూర్యాపేట)
జక్కు తుషారా (హైదరాబాద్ )
షేక్ ఫర్మాన్ షా (మహబూబ్ నగర్ )
నామల లోకేశ్ (వరంగల్)
నంద వర్ధన్ రెడ్డి (సూర్యాపేట)
మహమ్మద్ అర్బాజ్ అలీ (ఖమ్మం)
రోతు అజయ్ (హైదరాబాద్)
షేక్ జహీద్ (భద్రాద్రి కొత్త గూడెం)
కున్‌సోత్ అనుదీప్ (మంచిర్యాల)
కటకం ప్రణవి (జగిత్యాల)
జంగాల అవినాష్ అంగాడ్ (నల్లగొండ)
అన్నం హరి కృష్ణ (సంగారెడ్డి )
గడ్డం తేజస్వినీ (హైదరాబాద్ )

# వడదెబ్బకు 16 మంది మృతి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

వడగాలుల ప్రభావంతో ఏడు జిల్లాల్లో నేడు 16 మంది మృత్యువాత పడ్డట్లు ప్రభుత్వం వెల్లడించింది. నిన్నటి ఎండ తీవ్రత కారణంగా 34 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనలుగురు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని వెల్లడించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్లు వడగాలుల పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని గ్రామ, మండల స్థాయి సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని అన్నారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలతోపాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతేనన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

పెరుగుతున్న ఉష్ణాగ్రతలతో రాష్ట్రంలో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వడదెబ్బకు గురై పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాలో ముగ్గురు చొప్పున మరణించారు. మృతుల్లో ఒకరు హోంగార్డు కాగా, ఇద్దరు టీ, ఇంకొకరు వ్యాపారి. రోజంతా ఎండలో హైవేపెట్రోలింగ్ డ్యూటీ చేయడంతో ఆరోగ్యం సహకరించక ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో శ్రీనివాస్ కింద పడి మృతి చెందారు. మృతుల్లో ఒకరు మహారాష్ట్ర చంద్రాపూర్కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్లిన చెప్పుల వ్యాపారి రాజేశ్వర్ వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ రాజేశ్వర్ మృతిచెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాదఘటన చోటుచేసుకుంది. కాళేశ్వరంలోని ఇప్పల్ బోరు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. పుష్కరాలకు వచ్చిన ఆ వ్యక్తి ఇప్పలబోరు వద్ద అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆవ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బయటకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తెలంగాణలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి.

# భూమి కోసం దారుణం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

పుట్టింటి ప్రేమ, తోడబుట్టిన అనుబంధం, కుటుంబం బంధాలు ఇవన్నీ ఒకప్పుడు మనిషికి అండగా నిలిచేవి. కానీ ఇప్పుడు ఆస్తి కోసం అవే బంధాలు శత్రుత్వంగా మారుతున్నాయి. అక్కా అనే పిలుపులో అమ్మ ఉంటుంది. అక్కే అమ్మై తన తర్వాత పుట్టిన తోబుట్టువులను సాకుతుంది. కానీ ఆ తమ్ముడికి అవేమీ కనిపించలేదు. చిన్నప్పుడు స్నానం చేయించి, ఆడించి, లాలించి నిద్రపుచ్చిన అక్క ప్రేమ ఏమాత్రం గుర్తుకురాలేదు. భార్యాపిల్లలతో కలిసి ఆస్తి కోసం అక్కనే అంతం చేశాడు. వివరాల్లోకి వెళితే ఇలా ఉన్నాయి.సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండలం తుమ్మల పెన్‌పహాడ్‌కు చెందిన సురభి బుచ్చయ్య, లక్ష్మమ్మలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సైదులు ఉన్నారు. పెద్దకుమార్తె సురభి అంజమ్మ భర్తలేకపోవడంతో అదే గ్రామంలో నివసిస్తోంది. వారి చిన్న కుమార్తె ఉమకు వివాహ సమయంలో పసుపు కుంకుమల కింద 2 ఎకరాల 20 గుంటల భూమి ఇవ్వగా ఆమె పేరుపై 2 ఎకరాల 3 గుంటల భూమి రిజిస్ట్రేషన్ అయ్యింది. మిగిలిన 17 గుంటల భూమి ఇతర కారణాల వల్ల రిజిస్ట్రేషన్ కాలేదు. ఆ 17 గుంటల భూమి కోసం ఉమ కుటుంబానికి, ఆమె అన్న సైదులు కుటుంబానికి మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దక్క సురభి అంజమ్మ చెల్లెలు ఉమకు మద్దతుగా నిలిచింది. ఆ 17 గుంటల భూమి ఉమకే చెందాలంటూ అంజమ్మ తన తమ్ముడు సైదులుతో గొడవపడేది. అక్కాతమ్ముళ్ల మధ్య గొడవలు జరుగుతున్న క్రమంలో 2025 జులైలో సైదులు, అతని భార్య, కుమారుడు, వారి బంధువులు కలిసి అంజమ్మ, ఉమపై దాడి చేశారు. దీంతో వారిపై అప్పట్లో ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసు ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. 17 గుంటల భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనుకున్న సైదులు కుటుంబం అంజమ్మ, ఉమల అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. ముందుగా అంజమ్మను అంతమొందిస్తే అడ్డు చెప్పేవారు ఉండరని భావించారు. ఇందుకోసం పక్కా ప్రణాళికతో అదును కోసం ఎదురు చూశారు. ఈనెల 18న ఉదయం 6 గంటల సమయంలో ఉపాధి హామీ పనికి వెళ్తున్న అంజమ్మపై సైదులు దాడికి పాల్పడ్డాడు. తోడబుట్టిన అక్క అనే ఆలోచనను మరిచి కిరాతకంగా కత్తితో నరికి చంపాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. దాడికి పాల్పడ్డ సైదులు, హత్యలో పరోక్షంగా భాగస్వాములుగా ఉన్న అతని భార్య ధనలక్ష్మి, కుమారుడు శివతేజలు నడిగూడెం మండలం, బృందావనపురంలోని సైదులు బావమర్ది కొండ భీమయ్య ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న కొండ భీమయ్య కోసం గాలిస్తున్నారు. భూతగాదాలు, ఆస్తి పంపకాల్లో వివాదాలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ భౌతిక దాడులకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు వస్తే చర్చలతో పరిష్కరించుకోవాల్సింది పోయి అయినవారిపైనే కక్షలు పెంచుకుంటున్నారు. దాడులకు దిగి హత్యలకు పాల్పడుతున్నారు. అయినవారికంటే ఆస్తులకే విలువ పెరిగితే కుటుంబాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో ఈ ఘటనే ఉదహరణ.





# న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ దారుణ హత్య

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ పరిధిలో శనివారం ఉదయం దారుణ ఘటన జరిగింది. ప్రముఖ న్యాయవాద ఖాజా మొయినుద్దీన్ ఇంటి బయటకు వచ్చి కారు కారుతో ఢీకొట్టి కొద్ది దూరం అలాగే ఈడ్చుకెళ్లారు. దాంతో తీవ్రంగా గాయపడిన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. న్యాయవాది ఖాజా మొయినుద్దీన్(63) శనివారం ఉదయం తన నివాసం నుంచి వ్యక్తిగత పనిపై బయటకు వచ్చి కారు వద్దకు వెళ్లారు. ఈ సమయంలో ఆయన కదలికలను గమనిస్తున్న దుండగులు నెంబర్ ప్లేట్ లేని కారుతో వేగంగా వచ్చిన ఆయనను బలంగా ఢీకొట్టారు. దాంతో కిందపడిన న్యాయవాదిని కారుతో అలాగే కొద్దిదూరం ఈడ్చుకెళ్లి వదిలేసి.. నిందితులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయనను సమీప ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయారు. ఈ ఘటనపై పోలీసులు పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టారు. భూ వివాదాలు, వక్ఫ్ బోర్డు ఆస్తుల కేసుల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మృతుడి కుమారుడు ఫర్హాన్ కూడా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తన తండ్రి హత్యపై స్పందించిన ఆయన.. మలక్‌పేట్, మల్లేపల్లి, హైదరాబాద్ శివార్లలోని వక్ఫ్ ఆస్తుల అక్రమ ఆక్రమణలు, కబ్జాలు, ప్రయివేటు రిజిస్ట్రేషన్లకు సంబంధించిన కేసులను తన తండ్రి వాదిస్తున్నారని తెలిపారు. ఈ కేసుల నేపథ్యంలో పలువురి నుంచి తన తండ్రికి బెదిరింపులు, భయపెట్టే ప్రయత్నాలు జరిగినట్టు చెప్పారు. వారే ఈ హత్య చేసి ఉంటారని, ప్రభుత్వం తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

# మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరు

▶▶ మొదటిపేజీ తరువాయి

తప్పేనని, ప్రజలు తమను కోరుకోలేదన్నది నిజమని స్పష్టంచేశారు.తెలంగాణ సమాచారం
దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి రాగలుగుతున్నా, తెలంగాణలో మాత్రం అధికారం చేరువలో కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఇందు కు స్థానిక నాయకత్వ సమస్యలే కారణమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెద్ద గ్రూప్ లీడర్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని అభిప్రాయపడ్డారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో వివాదంపై స్పందిస్తూ.. పార్టీలో అభిప్రాయ భేదాలు ఉంటాయని, అయితే తాను ఎవరిపై ఫిర్యాదులు చేయలేదని తెలిపారు.Geographic Reference బండి భగీరథ్‌పై పోక్సో కేసు వెనుక తాను ఉన్నాననే ప్రచారంపై స్పందిస్తూ.. ఆ ఊహాగానాల్లో నిజం లేదని స్పష్టంచేశారు. పోక్సో కేసు తర్వాత బండి సంజయ్‌తో తాను మాట్లాడలేదని చెప్పారు. 2019లో బండికి టికెట్ ఇవ్వాలని కోరిన వారిలో తాను మొదటి వ్యక్తిని అని, తాను రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలని కోరితే, కొత్తగా పార్టీలోకి రావడంతో కుదరదని అధిష్ఠానం తేల్చి చెప్పినట్టు ఆయన వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సగం క్యాబినెట్‌లో క్వాలిటీ కాంగ్రెస్ లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర పనిచేసేందుకు మంత్రులే ఇష్టపడటం లేదని, తెలంగాణలో వామపక్ష భావజాలం లేదని అరవింద్ అభిప్రాయపడ్డారు.



# ఎండలతో జాగ్రత్త.... ఆరోగ్యంతోనే భవిత

- ప్రజలంతా ఎండలతో అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ నిబంధనలను, వైద్యుల సూచనలను పాటించాలి
- వడదెబ్బకు తగలకుండా ముందస్తు చర్యలు తీసుకోండి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత గూడూరు సతీష్ కుమార్



**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్రంలో ఎండలు తీవ్రరూపం దాల్చి మండుతున్నాయని,ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టూ ఉన్న చాలా మండలాలు,గ్రామ పరిసర ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత గూడూరు సతీష్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాష్ట్రంలో నిప్పల కొలిమిలా ఎండలు కొడుతున్నాయని,వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకపోవడమే మంచిదని ,అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సతీష్ సూచించారు.తగు చర్యలు తీసుకుంటూ,వైద్యుల సూచనలను పాటించాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 16 జిల్లాల్లో 46 డిగ్రీలు ఉష్ణోగ్రత దాటిందని,మరో నాలుగు రోజులు ఎండ తీవ్రత ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిందని తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్,మంచిర్యాల,నిర్మల్, నిజామాబాద్,జగిత్యాల,రాజన్న సిరిసిల్ల,కరీంనగర్,పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు,భద్రాద్రి కొత్తగూడెం,ఖమ్మం,నల్గొండ,సూర్యాపేట, మహబూబాబాద్,వరంగల్, హనుమకొండ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసిందని గుర్తు చేశారు.గర్భిణీ స్త్రీలు,వృద్ధులు,పిల్లలు జాగ్రతలు పాటించాలన్నారు. డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలని, తగినంత నీరును తాగాలని,కొబ్బరి నీళ్లు,పండ్ల రసాలను సేవించాలన్నారు.ఒకవేళ ఎవరైనా వడదెబ్బ కు గురైతే వెంటనే 108 అంబులెన్స్ సేవలను పొందాలని సూచించారు.ప్రతీ ఆరోగ్య కేంద్రం,ఉప కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రిల్లో,గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ విధిగా ప్రభుత్వ నియమాలను,వైద్యుల సూచనలను పాటించాలని కోరారు.

**వడదెబ్బ మృతులకు రూ.4 లక్షల పరిహారం: పొంగులేటి**

సిఎం రేవంత్ సూచనల మేరకు వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరడం జరిగిందని,ఉష్ణోగ్రతలపై సచివాలయంలో అధికారులతో సమీక్షించిన అనంతరం,రాష్ట్రంలో 16 మంది వడదెబ్బతో మరణించారని,ఆ కుటుంబాలకు వేగంగా పరిహారం అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం కష్టకాలంలో ప్రజలకు ఎప్పుడూ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా సతీష్ అన్నారు.





# ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.3 కోట్ల 66 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, విలీన గ్రామాలలో 3 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శర వేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ, అమీన్ పూర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

# మహేష్ కుమార్ గౌడ్ పై తప్పుడు కథనలను రాస్తే ఖబడ్దార్

- బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్.



**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా :**

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పై తప్పుడు కథనలను ప్రసారం చేస్తే భౌతిక దాడులు తప్పవని బిగ్ టీవీ చైర్మన్ యెన్నం విజయ్ రెడ్డిని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్ హెచ్చరించారు.మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షులుగా నియామకం కాకముందు కాంగ్రెస్ పార్టీలో విపరీతమైన గ్రూప్ రాజకీయాలు, వర్గ విబేధాలు ఉండేవి అట్లాంటి కాంగ్రెస్ పార్టీని ఐక్యమత్యంతో నడిపించడంలో సక్సెస్ అయ్యారని బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు.కులగణన నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషించడంతో పాటు,కంటోన్ మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలలో,సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో చాలా పడడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకలలో బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధిక ప్రాధాన్యం కల్పించి సామజిక న్యాయానికి పెద్ద పీఠ వేసినందుకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో బీసీ ల నాయకత్వం బలపడుతుందనే అక్కసుతో బిగ్ టీవీ చైర్మన్ యెన్నం విజయ్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పై తప్పుడు కథనలను ప్రసారం చేసారని, ఇకనుండి మళ్ళీ తప్పుడు కథనలను ప్రసారం చేస్తే బిగ్ టీవీ ఆఫీస్ పై భౌతిక దాడులకు కూడ వెనకడబోమని బొల్లెపల్లి స్వామిగౌడ్ బిగ్ టీవీ చైర్మన్ యెన్నం విజయ్ రెడ్డిని హెచ్చరించారు



# చింతలదిన్నె గ్రామంలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

మద్దూర్ మండలంలోని చింతలదిన్నె గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజిఎస్) పనులను ఎంపిడిఓ రామన్న,మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్ కుమార్,ఏపిఓ నాగరాజు సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతి ,ఉపాధి కూలీల హాజరు మరియు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు.ప్రస్తుతం తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు హాజరై మధ్యాహ్నపు ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.అధిక వేడి కారణంగా డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి,తగినంత నీరు సేవించాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ చెరువుల నుండి తీసే మట్టిని వ్యవసాయ భూములకు తరలించడం వల్ల భూమిలో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి నేల సారవంతమై మెరుగుపడుతుందని తెలిపారు. దీనివల్ల పంట దిగుబడులు పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని వివరించారు.



# ఆర్య సమాజ్ పురోహితులకు గౌరవ వేతనం ఇవ్వాలి

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:**

ఆర్య సమాజ్ పురోహితులకు గౌరవ వేతనం చెల్లించాలి శుక్రవారం తెలంగాణ బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు తార్నాకలోని వారి నివాసంలో ఆర్య సమాజ ప్రతినిధి వర్గం కలిశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మత గురువులకు, క్రైస్తవ ఫాదర్స్ కు, దేవాలయ అర్చకులకు నెలకు గౌరవ వేతనం 11000/ రూపాయలు ఇస్తున్నట్లుగా తెలంగాణ ఆర్య సమాజ్ పురోహితులకు కూడా ప్రతి నెల గౌరవ వేతనం 11 వేల రూపాయలు ఇప్పించాలని రామచంద్ర రావు కి వినతి పత్రం అందజేశారు. ఆర్య సమాజం స్థాపించి 150 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా హైదరాబాద్ విముక్తికై ఆర్య సమాజం చేసిన పోరాటంలో ఆర్య వీరులు ఎందరో బలిదానమయ్యారని తెలియజేశారు. ఆర్య సమాజ పురోహితులు వివాహాలు, గృహప్రవేశాలు, యజ్ఞాలు, అంత్యేష్టి మున్నగు 16 సంస్కారాలు నిత్యం నిర్వహిస్తున్నారని వారికి కూడా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రతినెల 11 వేల రూపాయల గౌరవ వేతనం చెల్లించాలని కోరారు.రామచంద్ర రావు స్పందిస్తూ ఆర్య సమాజం వల్లనే తెలంగాణ విముక్తి జరిగిందని ఆర్య సత్యాగ్రహములో వందలాది మంది ఆర్య సమాధికులు బలిదానమయ్యారని ఆర్య సమాజం స్థాపించి 150 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆర్య సమాజ వైదిక పురోహితులకు ప్రతి నెల 11 వేల రూపాయల గౌరవ వేతనం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి కి ఇతర సంబంధిత అధికారులకు పత్రాలు వాస్తామని తెలిపారు. ఇది ఆర్య సమాజ పురోహితుల న్యాయమైన డిమాండ్ వారికి గౌరవ వేతనం ఇచ్చే విధంగా నా తరపున బిజెపి పార్టీ పక్షాన గట్టి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య సమాజం ప్రతినిధులు డాక్టర్ ధర్మతేజ, ధర్మపాల్ ఆర్య, పృథ్వి ఆర్య, నరేంద్ర ఆర్య ఉపేందర్ ఆర్య,పృథ్వీరాజ్ ఆర్య, అరవింద్ఆర్య, జయరాజ్ ఆర్య, శ్యాంప్రసాద్ ఆర్య పాల్గొన్నారు.






# ప్రమాదంలో సబ్ సెంటర్ భవనం

- పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట మండలం, కోటకొండ గ్రామంలోని ప్రాథమిక కేంద్రానికి సంబంధించిన సబ్ సెంటర్ ప్రమాదకరంగా మారింది.స్లాబ్ ఎప్పుడు కూలిపోతుందో అనే రకంగా తయారైన పరిస్థితి ఉన్నదని,అంతే కాకుండా జిల్లా కలెక్టర్,స్థానిక ఎమ్మెల్యే,జిల్లా వైద్యాధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకునే వారే కరవయ్యారని ప్రజలు వాపోయారు.ప్రతి సోమవారం,బుధవారం బాలింతలకు నిర్వహించే వ్యాక్సినేషన్ టైంలో విద్యుత్ షాక్ వస్తుందని,భవనంలో ఉన్న విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించడంతో పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ చేయడానికి ఆశ వర్కర్లు ఇబ్బంది పడుతున్నారు.భవనం ఎప్పుడు కూలిపోతుందో ఏమో అనే భయభ్రాంతులతో వాక్సినేషన్ చేస్తున్నారు.వచ్చేది వర్షాకాలం కాబట్టి ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు,కలెక్టర్ స్పందించి నూతన సబ్ సెంటర్ భవనాన్ని నిర్మించాలని గ్రామ ప్రజలుడిమాండ్ చేస్తున్నారు.

# ఎస్సీ,ఎస్టీ బాధితులకు సకాలంలో న్యాయం చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**



ఎస్సీ, ఎస్టీ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.అట్రాసిటీ కేసుల పరిహారం నిర్దేశిత గడువులోగా విడుదల చేయాలని,పెండింగ్ కేసుల్లో సాక్ష్యాధారాల సమర్పణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ప్రతి నెల లో జరిగే సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి తహశీల్దార్లు,ఎస్సైలు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.





# ముందస్తు అరెస్టులు ప్రభుత్వ పిరికి చర్య

- ఈ నెల 13,14,15న నిరుద్యోగ జెఏసి నిరసనలు
- టిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్.
- జన సేవ సమితి అధ్యక్షుడు తగ్గుళ్ళ జనార్ధన్

**తెలంగాణ చౌరస్తా, ఆత్మకూరు:**

ఈ నెల 13,14,15న నిరుద్యోగ జెఏసి తలపెట్టిన నిరసరనలను రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకుంటూ...ముదస్తు అరెస్టులు చేపట్టడం ప్రభుత్వ పిరికి చర్య అని టిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్, జన సేవ సమితి అధ్యక్షుడు తగ్గుళ్ళ జనార్ధన్ అన్నారు.ఒకే సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం అని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టి నిరుద్యోగులను పూర్తగా వంచించిందన్నారు. విద్యార్థి,నిరుద్యోగల అండతో ఎర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని విస్మరించిందని బారి అశోక్ కుమార్ వాపోయారు.మార్చ్ 13న శాంతియుత నిరుద్యోగ మార్చ్‌ను అడ్డుకుంటూ జిల్లాల్లో జరిగిన అక్రమ అరెస్టులను. విద్యార్థి, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగ ఖండించారు.గత ఎన్నికల్లో నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు.ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ మరియు సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు విడుదల చేస్తామని మోసపూరిత హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండ కాగితాలకే పరిమితం చేస్తుందన్నారు.తక్షణమే ఖచ్చితమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే నిరాశ,నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న లక్షలాదిమంది విద్యార్థి నిరుద్యోగులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ ధర్నా

- రైతు వ్యతిరేక పాలనకు ప్రజలే తగిన పాఠం చెప్తారు
- మొక్కలు కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వమే గన్నిసంచులు,సుత్తి లు అందించాలి
- బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ నూనేటి సంపత్
- మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి




**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు ప్రస్తుత ప్రభుత్వానికి కనిపించడం లేదని బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ నూనేటి సంపత్,మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి తీవ్రంగా విమర్శించారు.వరి,మక్కల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులపై బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లోని వరి,మక్కల కొనుగోలు కేంద్రాలను పరిశీలించి,బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వడ్ల కొనుగోలులో ఒక బస్తాకు 40 కిలోల 650 గ్రాములు మాత్రమే కాంట వేయవలసి ఉండగా,41 కిలోల 500 గ్రాములు అదనంగా తూకం వేస్తున్నారని ఆరోపించారు.అంటే రెండు బస్తాలకు కలిపి క్వింటాకు సుమారు 2 కిలోల వరకు అదనంగా తూకం వేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని మండిపడ్డారు.స్థానిక ఎమ్మెల్యే చెప్పేది ఒకటైతే,సంబంధిత అధికారులు అమలు చేస్తున్నది మరోలా ఉందని విమర్శించారు.అలాగే డీసీఎంఎస్ మక్కల కొనుగోలులో కూడా 51 కిలోల తూకం వేయవలసి ఉండాగా బస్తాలకు 51 కిలోల 500 గ్రాములు వేయిస్తున్నారని ఆరోపించారు.మక్కల రైతులకు గన్నీ సంచులతో పాటు సుతిల్ సదుపాయం కల్పించకుండా, తమ ఖర్చుతో కొనుగోలు చేసుకోవాలని చెప్పడం ద్వారా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు గన్నీ సంచులతో పాటు స్తుతిల్ సదుపాయం వెంటనే కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా నిరాశపరిచిందని విమర్శించారు.రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుందని,రైతు వ్యతిరేక పాలనకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.కష్టకాలంలో రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల్లో జాప్యాలు కొనసాగితే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైరం రమేష్, బిఆర్ఎస్ నాయకులు జూకంటి అనిల్,నిదానపురం దేవయ్య,నూనేటి కుమార్ యాదవ్,మాదాసి రామచంద్రం,బోలమల్ల శంకర్,కుంభం రాజు,దండి అజయ్,నవీన్ యాదవ్, నాయకులు కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# గుణగంటి సత్యనారాయణ జీవితం ఆదర్శనీయం

- న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా :**





చిల్పకుంట్ల గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ గుణగంటి సత్యనారాయణ 8వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, కామ్రేడ్ సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తూ అనేక మంది పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప విద్యావేత్త, మేధావి అని కొనియాడారు.గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని తెలిపారు. కామ్రేడ్ సత్యనారాయణ మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దేశోజు మధు, దగ్గుల మల్లయ్య, జటంగి వీరమల్లు, మండడి భూపాల్ రెడ్డి, కుసులింగయ్య, జటంగి సతీష్, బాణాల వెంకటరెడ్డి, ముండ్ల మల్లయ్య, పంతం శీను, కూసు రాము, కేశబోయిన మల్లయ్య, కృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని వదిలేయొద్దు

**ప్రపంచంలో ప్రతి గొప్ప ప్రయాణం ఒక చిన్న ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఒక వ్యాపారం, ఒక కంపెనీ, ఒక స్వచ్ఛంద సంస్థ లేదా ఏదైనా ఉద్యమం ఇవన్నీ మొదట ఒక లక్ష్యంతో, ఒక అవసరంతో, ఒక కలతో మొదలవుతాయి. ఆ ప్రారంభంలో ఉండే ఆశయం, సమాజానికి ఉపయోగపడాలనే తపన, ఏదో సాధించాలనే పట్టుదలే ఆ సంస్థకు నిజమైన పునాది. ప్రారంభ దశలో ఎదురయ్యే కష్టాలు మనిషిని మరింత దృఢంగా మారుస్తాయి. కానీ ప్రయాణం ముందుకు సాగేకొద్దీ పరిస్థితులు మారుతాయి.**



కొత్త వ్యక్తులు పరిచయం అవుతారు. అవకాశాలు పెరుగుతాయి. కొన్నిసార్లు లాభాలు, పేరు, ప్రాధాన్యతలు కూడా మారిపోతాయి. ఈ మార్పుల మధ్య చాలా మంది మొదట ప్రారంభించిన అసలు లక్ష్యాన్ని మర్చిపోతారు. స్వచ్ఛంద సంస్థ ప్రారంభంలో చేసే కార్యక్రమాల వలననే గుర్తింపు వస్తుంది. సంస్థకైనా, వ్యక్తులకైనా అదే మొదటి ముద్ర. ప్రజల మధ్య నమ్మకం, గౌరవం, ఆదరణ కూడా ఆ సేవా కార్యక్రమాల ద్వారానే ఏర్పడతాయి. కానీ చాలా సందర్భాల్లో గుర్తింపు వచ్చిన తర్వాత మొదట ప్రారంభించిన సేవలను, ఆశయాలను, లక్ష్యాలను మరిచిపోతుంటారు. ప్రచారం పెరిగేకొద్దీ సేవ తగ్గిపోవడం, పేరు పెరిగేకొద్దీ బాధ్యత తగ్గిపోవడం, ఇది నేటి సమాజంలో కనిపిస్తున్న బాధాకరమైన నిజం. నిజమైన సేవ అనేది గుర్తింపుకు కాదు.. కానీ ప్రారంభమై గుర్తింపు వచ్చిన తర్వాత ఆగిపోవడం కాదు. ప్రజల అవసరాలు ఉన్నంత వరకు అదే అంకితభావంతో కొనసాగించడమే అసలైన సేవా ధర్మం. ఒక సంస్థ గొప్పతనాన్ని నిర్ణయించేది దాని ప్రారంభ వేడుకలు కాదు కాలం గడిచినా అదే నిబద్ధతతో కొనసాగించే సేవా కార్యక్రమాలే. "ప్రారంభించిన సేవను నిలబెట్టుకోవడం... అదే అసలైన సామాజిక బాధ్యత." వ్యాపారం అంటే కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాదు. అది ఒక బాధ్యత. కంపెనీ అంటే కేవలం ఉద్యోగాల కల్పన కాదు; అది ఒక ఆలోచనకు రూపం. స్వచ్ఛంద సంస్థ అంటే కేవలం సేవ కార్యక్రమాలు కాదు;, సమాజంపై ఉన్న బాధ్యతను కార్యరూపంలో చూపించడం. అందుకే ఏ సంస్థ అయినా తన ప్రారంభ ఉద్దేశ్యాన్ని ఎప్పటికీ వదిలేయకూడదు. మార్పులు రావడం సహజం. కాలానికి అనుగుణంగా విధానాలు మారవచ్చు. పని చేసే పద్ధతులు మారవచ్చు. కానీ లక్ష్యం, దృక్పథం మారకూడదు. ఎందుకంటే లక్ష్యాన్ని కోల్పోయిన సంస్థ బయటకు ఎంత పెద్దదిగా కనిపించినా, లోపల ఖాళీగా మారిపోతుంది. చరిత్రలో నిలిచిపోయిన ఎన్నో గొప్ప సంస్థలు తమ మొదటి విలువలను గౌరవించాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాయి. అందుకే అవి కాలంతో పాటు ఎదిగినా, తమ అసలు ఉద్దేశ్యాన్ని మరువలేదు. అదే వాటి విజయ రహస్యం. ఒక వ్యక్తి గానీ, ఒక సంస్థ గానీ ఎత్తులకు ఎదగడం గొప్ప విషయం. కానీ ఎందుకు ప్రారంభించామో గుర్తుంచుకుని ముందుకు సాగడం ఇంకా గొప్ప విషయం. ఎందుకంటే లక్ష్యం ఉన్న ప్రయాణానికి దిశ ఉంటుంది. ఆ దిశే విజయాన్ని నిలబెడుతుంది. కాబట్టి ఎన్ని మార్పులు వచ్చినా, ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత పేరు సంపాదించినా ప్రారంభించిన లక్ష్యాన్ని ఎప్పటికీ వదిలేయొద్దు.



డాక్టర్. వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్,
9393613555,9493613555.



## కుల వివక్షత చూపిన నిందితులను రిమాండ్ చేయాలి

- **లేనియెడల రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చెప్పడతాం**
- **బాధితులను బెదిరిస్తున్న నిందితులు వారి అనుయాయులు**
- **పోలిసులు జాప్యానికి అనుమనాలు తలెట్టుతున్నాయి**
- **దళిత హక్కుల పోరాట సంఘం**

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

సూర్య చెంద్రుల మీద ప్రయోగాలు జరిగే ఈ రోజుల్లో కులం పేరుతో అమానుషంగా ప్రవర్తించడం షోచనీయమైన అంశం అని కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో జరిగిన అమానుష ఘటన విషయంలో పోలీసులు నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చెప్పడతామని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ళ పెల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.మే 19వ తేదీ మంగళ వారం తెల్లవారు జామున ఎల్లమ్మ తల్లి బోనాల సందర్భంగా జరిగిన కుల వివక్ష సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా అలజడి సృష్టిస్తుంది అని,ఇలాంటి చెదురు మోదురు ఘటనలు జరిగుతున్న పోలీసు వ్యవస్థ ఏమరు పాటుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఇలాంటి సున్నితమైన అంశాల పట్ల అన్నీ వర్గాల ప్రజలకు అవసరమైతే అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.వివక్ష ఎదురుకున్న మహిళలతో మాట్లాడి సంఘీభావం తెలిపారు.వారికి న్యాయం జరిగే వరకు సంఘం తమకు వెన్నంటి ఉంటుందని, దేనికీ అధైర్యపడవద్దని పోరాడి హక్కులు సాధించుకోవడం అనేది తరతరాలుగా మన రక్తంలోనే ఉందని పోరాడడం కోసం యావత్ దళిత సమాజం అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ విషయమై అసిస్టెంట్ కమీషనర్ గజ్జి కృష్ణని ఫోన్ లొ సంప్రదించగా విచారణ జరుగుతోందని తొందరలోనే నిందితుల మీద చెర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెర్క లక్ష్మణ్,దళిత హక్కుల పోరాట సంఘం ప్రచార కార్యదర్శి సంటి గణపతి పాల్గొన్నారు.




## ఓదెలలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

- **వరుస అగ్ని ప్రమాదాలతో జనం బెంబేలు**
- **ఓదెల డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్షుడు కలవేని శ్రీనివాస్**

**ఓదెల, తెలంగాణ చౌరస్తా:**

గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న వరుస అగ్ని ప్రమాదాలతో ఓదెల,కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో కోట్లాది ఆస్తి నష్టం, కొన్ని సార్లు ప్రాణ నష్టం జరుగుతుంది.పెద్దపల్లిలో ఉన్న ఫైర్ ఇంజిన్ సకాలంలో చేరుకోకపోవడంతో జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోతుంది.ఇటీవల ఓదెల మండలంలోని ఓదెల,కనగర్తి, ఇందుర్తి గ్రామాల్లో అగ్ని ప్రమాదాల వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగింది.రాష్టంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఇక్కడ నమోదవడం వలన భారీగా అగ్ని ప్రమాదాలు చోటు చోటు చేసుకుంటున్నాయని కాబట్టి ఓదెల లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఓదెల డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్షుడు కలవేని శ్రీనివాస్ కోరారు. దీని వల్ల సత్వరం సంఘటన స్థలానికి చేరుకొని అష్టి నష్టం,ప్రాణ నష్టం జరగకుండా కపడుకోవచ్చునని తెలిపారు.ఈ దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## యూనివర్సల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని ఘనశ్యాందాస్ నగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ నీట్ ఐఐటీ ఫౌండేషన్ హై స్కూల్ విద్యార్థి ఆదిత్య వర్మ పదో తరగతిలో 10 పాయింట్స్ సాధించి పాలిసెట్ పరీక్షలో స్టేట్ 21వ ర్యాంక్ సాధించాడు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఇస్మాయిల్లప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్,ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



## పాలీసెట్ లో 'గోల్డెన్ స్కూల్' కు ఫస్ట్ ర్యాంక్

- **రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్ గోల్డెన్ స్కూల్ విద్యార్థి**
- **అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థికి అభినందల వెల్లువ**
- **గోల్డెన్ ఓక్ స్కూల్ చైర్మన్ గంట రవికుమార్ హర్షం**

**వరంగల్, తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ పాలీసెట్ ఫలితాల్లో శివనగర్‌లోని గోల్డెన్ ఓక్ స్కూల్ విద్యార్థి నామాల లోకేష్ అసాధారణ ప్రతిభ కనబరిచారు.కఠినమైన పోటీతో కూడిన ఈ పరీక్షలో సదరు విద్యార్థి ఎంపీసీ రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్ ఎంబిఐపిసిలో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు.పాఠశాలలో అందించిన నాణ్యమైన విద్యాబోధన,ప్రత్యేక ప్రణాళికలు, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ ర్యాంక్ సాధ్యమైందని విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో ఈ విద్యార్థి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల మేనేజ్‌మెంట్,ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు.విద్యార్థి సాధించిన ఈ ఘన విజయం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గంట రవికుమార్ మాట్లాడుతూ.... విద్యార్థి మొదటి నుండి చదువులో ఎంతో ప్రతిభావంతుడని,క్రమశిక్షణ,కష్టపడే తత్వమే ఈరోజున రాష్ట్ర స్థాయిలో ఇంతటి ఉత్తమ ర్యాంక్ రావడానికి కారణమని కొనియాడారు.అహర్నిశలు శ్రమించి ఈ విజయాన్ని అందుకున్న విద్యార్థిని,అందుకు సహకరించిన వారి తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.






## కార్యకర్త కుటుంబానికి అండగా వొడితల ప్రణవ్

- **కార్యకర్తలకు ఆపదవస్తే ముందుటాడని మరోసారి రుజువు**

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా:**

కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త తన కుటుంబంగా భావించి,కార్యకర్తలకు ఆపద వస్తే ముందుండి ఆ కుటుంబానికి పెద్ద దిక్కులాగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ నిలబడ్డారని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.శనివారం రోజున ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మహమ్మద్ సలీం పాషా కుటుంబానికి యాభై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రణవ్ జమ్మికుంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనుకాగా వారిని నాయకులు ఓదార్చారు.అనంతరం వారు మాట్లాడుతూ....మాలో ఒకడిగా ఉన్న సలీం పాషా మరణం బాధాకరమని,కార్యకర్తలకు భరోసాను ఇస్తూ హుజూరాబాద్ ఇంచార్జి ప్రణవ్ బాబు కుటుంబానికి అండగా నిలబడడం ద్వారా కష్ట సమయంలో కుటుంబానికి అండగా మానవతావాదిగా ఉంటారని తెలియజేశారన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్,పిసిసి ఎగ్జిక్యూటివ్ నెంబర్ సాయిని రవి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య,దుబ మల్లన్న చైర్మన్ ముద్ద మల రవి,జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ లింగంపల్లి లింగారావు, పాత ప్రసాద్, బొంగుని వీరన్న, సేవా అధ్యక్షులు బండి పవన్,పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## వరిగడ్డికి పెట్టిన నిప్పుతో... పామాయిల్ తోట దగ్ధం

- **ఏన్కూరులో రైతుకు భారీ ఆస్తి నష్టం**
- **20 పామాయిల్ మొక్కలు కాలిపోయిన ఘటన**

**ఏన్కూర్, తెలంగాణ చౌరస్తా :**

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు వరిగడ్డికి నిప్పు పెట్టడంతో సమీపంలోని పామాయిల్ తోటకు మంటలు వ్యాపించి 20 పామాయిల్ మొక్కలు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.ఏన్కూరుకు చెందిన రైతు మేడా శ్రీనివాసరావుకు చెందిన రేపల్లెవాడ రోడ్డులోని వ్యవసాయ పొలంలో ఈ ఘటన జరిగింది.వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిన గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పామాయిల్ తోటతో పాటు ఫెన్సింగ్ తీగలు కూడా కాలిపోయాయి.రైతు మేడా శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం,తమ పొలంలో సుమారు మూడు సంవత్సరాల క్రితం పామాయిల్ తోటను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పామాయిల్‌కు ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర ఉండటంతో నెలకు రెండుసార్లు కటింగ్ ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు.తోట చుట్టూ రక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేసినప్పటికీ,పక్కనే ఉన్న వరి పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వేగంగా వ్యాపించి పామాయిల్ మొక్కలను దహనం చేశారు,ఈ ప్రమాదంలో సుమారు 20 పామాయిల్ మొక్కలు పూర్తిగా కాలిపోగా,ఫెన్సింగ్ తీగలు కూడా దెబ్బతిన్నాయి.దీంతో రైతుకు గణనీయమైన ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.మంటలు వ్యాపించిన సమయంలో స్థానికులు,రైతులు కలిసి అగ్ని మాపేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే పామాయిల్ మొక్కలు దగ్ధమయ్యాయి.ఈ ఘటనపై రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.మూడు సంవత్సరాలుగా ఎంతో శ్రమించి పెంచుకున్న పామాయిల్ మొక్కలు ఒక్కసారిగా మంటల్లో కాలిపోవడం బాధాకరం.మాకు పెద్ద మొత్తంలో నష్టం జరిగింది అని రైతు మేడా శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయ భూముల్లో వరి గడ్డికి నిర్లక్ష్యంగా నిప్పు పెట్టడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవగాహన కల్పించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సభ్యత్వ నమోదు ఇంచార్జీ ఆర్జేసీ కృష్ణ



వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ

## వైరా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జీగా ఆర్జేసీ కృష్ణ

- **కోటి సభ్యత్వాల లక్ష్య సాధనకు కృషి చేయాలి**
- **వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ**

**వైరా, తెలంగాణ చౌరస్తా :**

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసే క్రమంలో వైరా నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా ఆర్జేసీ కృష్ణను నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.119 నియోజకవర్గాల్లో ప్రత్యేక ఇంచార్జీల నియామక ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.గ్రామ స్థాయి వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తరించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా కోటి సభ్యత్వాల లక్ష్యంతో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది.ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక ఇంచార్జీల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టి కార్యకర్తలను డిజిటల్ విధానంలో పార్టీతో అనుసంధానం చేయాలని కార్యాచరణ రూపొందించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.మండల,గ్రామ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ మాట్లాడుతూ....ఆర్జేసీ కృష్ణ నియామకం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చిందన్నారు."డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి వైరాలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలి" ఆయన పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సభ్యత్వాల లక్ష్య సాధనలో వైరా నియోజకవర్గం ముందుండేలా కృషి చేస్తామని బాదావత్ బాలాజీ తెలిపారు.ప్రతి కార్యకర్త చురుకుగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పార్టీ బలోపేతానికి సహకరించాలని సూచించారు. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్షా సమావేశాలు నిర్వహించి గ్రామ స్థాయిలో నమోదుల పురోగతిని పరిశీలించనున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు.డిజిటల్ సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తల పూర్తి వివరాలను సమగ్రంగా నమోదు చేయడంతో పాటు సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

## బీఆర్ఎస్ నాయకుని హత్య అత్యంత దారుణం

- **నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి**
- **మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి**
- **వైరా బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ**

**వైరా, తెలంగాణ చౌరస్తా:**

సూర్యాపేట మండలం యర్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ భర్త చింతలపాటి మధు హత్య ఘటనపై వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.రాజకీయ కక్షల నేపథ్యంలో ఒక నాయకుడిని దారుణంగా హత్య చేయడం బాధాకరమని,ఇటువంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలకు మచ్చ తెస్తాయని ఆయన పేర్కొన్నారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బాలాజీ మాట్లాడుతూ...చింతలపాటి మధు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం,పోలీసు అధికారులను డిమాండ్ చేశారు.రాజకీయ విభేదాలు హింసాత్మక ఘటనలకు దారితీయడం ఆందోళన కలిగించే విషయం.నిందితులను త్వరగా అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని బాలాజీ ఆందోళన వ్యక్తం చేశారు.రాజకీయ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేయడంతో పాటు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు.చింతలపాటి మధు హత్య కేసును వేగవంతంగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా,చింతలపాటి మధు హత్య ఘటనపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఘటన అనంతరం యర్రారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచుతున్నారు.

